సాక్షి
మహబూబాబాద్
ఆదివారం । 19 । మార్చి । 2023



అనాథలను కదిలిస్తే కన్నీళ్లే..!
చివరి మజిలీలో ఆదరణ లేక కొంతమంది వృద్ధులు ఆశ్రమంలో కాలం వెళ్లదీస్తున్నారు. వారిని కదిలిస్తే కన్నీటి పర్యంతమవుతున్నారు. - 8లో▸



అందమైన రాతతో మంచి మార్కులు
పరీక్షలో అదనంగా మార్కులు సాధించాలంటే చేతిరాత ఎంతో కీలకం. చేతిరాత బాగా లేకపోతే మూల్యాంకనం చేసే వ్యక్తికి అర్థం కాక మార్కులు తక్కువ పడే అవకాశం ఉంది. - 9లో▸

గరిష్టం/కనిష్టం
$30^0/18^0$

వాతావరణం
జిల్లాలో పొడి వాతావరణం ఉంటుంది. ఎండ తీవ్రత తక్కువగానే ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



మహబూబాబాద్: వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, వారి సమస్యలన్నీ పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. వీఓఏల టోకెన్ సమ్మెలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో వీఓఏలు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పొదుపు సంఘాల పుస్తకాల నిర్వాహణకు కేటాయించిన వీఓఏలకు అదనపు పనులు అప్పగిస్తూ పని భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్వాక్రా మహిళలకు పావలవడ్డీలు, అభయహస్తం, శ్రీనిధి, పొదుపులు, బ్యాంక్ నుంచి వడ్డీ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డ్వాక్రా మహిళలకు ప్రభుత్వమే ఐదు లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. వేతనాలు ఖాతాల్లో జమ చేయాలన్నారు. గ్రామ సంఘానికి పక్కా భవనాలు నిర్మించాలని, సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళనలు కొనసాగుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆకుల రాజు, వెలిశాల సుధాకర్, నాగన్న, రాజమౌళి, శోభారాణి, మౌనిక, కృష్ణవేణి, శ్రీలత, లలిత తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలి




దోర్నకల్: ఆర్టీసీ ద్వారా అందుతున్న సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఆర్టీసీ డిప్యూటీ రీజనల్ మేనేజర్ (ఆపరేషన్స్) బి.కృపాకర్ రెడ్డి కోరారు. స్థానిక బైపాస్ రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్‌ను శనివారం కృపాకర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం వసతులు కల్పిస్తామని, బస్సులు బస్టాండ్ ద్వారా బయలుదేరేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట మహబూబాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ విజయ్‌కుమార్ ఉన్నారు. అలాగే భద్రాద్రి రామచంద్రస్వామి కల్యాణ తలంబ్రాలను రూ.116 చెల్లిస్తే నేరుగా ఇంటికే అందించనున్నామన్నారు. పూర్తి వివరాలకు 9440720796 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

రూ. 116 చెల్లిస్తే ఇంటికే తలంబ్రాలు

నెహ్రూసెంటర్: శ్రీరామనవమి సందర్భంగా ఆర్టీసీ ఆధ్వర్యంలో రూ.116 చెల్లించి పేరు నమోదు చేసుకుంటే రాములోరి తలంబ్రాలు ఇంటికే అందజేస్తామని ఆర్టీసీ డీఎం జె.విజయ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు ఆర్టీసీ డీఎంతో 9154298768, 9100477150 నంబర్లో సంప్రదించాలన్నారు.

ఆలయ భూముల పరిరక్షణకు అడుగులు



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ భూములను రక్షించేందుకు ఆలయ ఈఓ నడుంబిగించారు. కురవి పెద్ద చెరువు ఎదురుగా 365 జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఆలయానికి సంబంధించిన సర్వే నంబర్లు 78, 79, 88, 169ల్లో 3.39 ఎకరాల భూమి ఉంది. జాతీయ రహదారికి ఆనుకుని ఉండడంతో ఆ భూమికి రూ.కోట్ల విలువ పలుకుతోంది. దీంతో అక్రమార్కులు ఆయా భూములను ఆక్రమించుకుని అన్యాక్రాంతం చేసి ఉంటారనే ఆరోపణల నేపథ్యంలో ఈఓ సత్యనారాయణ స్వయంగా రంగంలోకి దిగి భూములను రక్షించేందుకు కలెక్టర్‌కు ఓ లేఖ అందచేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం పెరిగిన ముళ్లపొదలను తొలగించి చదును పనులు మొదలుపెట్టారు. ఆలయ భూములను చదును చేయిస్తుండడంతో కొందరు వ్యక్తులు సర్వేను అడ్డుకునేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం.

20 నుంచి మార్కెట్‌కు సెలవులు

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 20 నుంచి 22 వరకు సెలవులను ప్రకటించినట్లు మార్కెట్ స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 20న ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా లావాదేవీలు సరి చూసుకునేందుకుగాను, 21న అమావాస్య, 22న ఉగాది పండుగ సందర్భంగా సెలవులను ప్రకటించినట్లు పేర్కొన్నారు. తిరిగి 23 నుంచి మార్కెట్‌లో యథావిధిగా కొనుగోళ్లు జరపనున్నట్లు తెలిపారు.

ఫలితాలే ప్రామాణికం

వందశాతం ఉత్తీర్ణత అందరి బాధ్యత

- విద్యార్థులను చదివించాలి.. పాస్ చేయించాలి..
- అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం
- పిల్లలకే కాదు.. ఉపాధ్యాయులకూ పరీక్ష



సాక్షి, మహబూబాబాద్: పదో తరగతి ఫలితాలే జిల్లా విద్యాశాఖ పనితీరుకు నిదర్శనంగా మారుతున్నాయి. ఉపాధ్యాయులు సరిగా బోధిస్తే విద్యార్థులు తప్పకుండా ఉత్తీర్ణులవుతారు. అందుకోసం అందరూ కష్టపడాలి. విద్యార్థులను చదివించాలి. ఉత్తీర్ణత శాతం పెంచాలి.. అప్పుడే రాష్ట్రంలో మానుకోటకు మంచి పేరు వస్తుందని కలెక్టర్ ప్రధానోపాధ్యాయులు, అధికారులను ఆదేశించారు. దీంతో మెరుగైన విద్యార్థులను మరింత మెరుగ్గా.. వెనకబడిన విద్యార్థులను కనీస ఉత్తీర్ణత వరకు తీసుకువచ్చేందుకు ఉపాధ్యాయులు శ్రమిస్తున్నారు.

సమీక్షలతో అప్రమత్తం

ఈ ఏడాది ప్రభుత్వ, జిల్లా పరిషత్, కేజీబీవీ, మోడల్ స్కూల్స్‌తోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు మొత్తం 209 ఉన్నాయి. వీటిల్లో ఈ ఏడాది పదో తరగతి చదివే వారు 4,249 మంది బాలురు, 4,210 మంది బాలికలు మొత్తం 8,459 మంది చదువుతున్నారు. ఈ విద్యార్థుల ప్రగతిని అంచనా వేయడం, మెరుగైన విద్యార్థులు, వెనకబడిన విద్యార్థులను గుర్తించాలి. మెరుగైన వారు 10/10 జీపీఏ సాధించేలా. వెనకబడిన విద్యార్థులు కనీసం ఉత్తీర్ణత సాధించేలా సంసిద్ధం చేయాలని కలెక్టర్ జిల్లాలోని అన్ని విభాగాల ప్రధానోపాధ్యాయులు, జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ఇప్పటికే రెండు, మూడు సార్లు సమీక్షలు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. పరీక్షలు దగ్గర పడుతున్నందున విద్యార్థులు అనారోగ్యానికి గురికాకుండా చూడాలి. ఇందుకోసం పౌష్టిక ఆహారం అందించడంతో పాటు ఉదయం, సాయంత్రం స్నాక్స్ అందజేయాలి. పరిశుభ్రత నేర్పించాలన్నారు. అంతటితో ఆగకుండా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో తయారు చేసిన ప్రత్యేక మెటీరియల్ కూడా విద్యార్థులకు అందచేశారు. ప్రతీ పాఠశాలకు, గురుకులానికి, రెసిడెన్షియల్ స్కూల్స్, కేజీబీవీ, మోడల్ స్కూల్స్ ఇలా ఒక్కొక్క పాఠశాలకు ప్రత్యేక అధికారిని నియమించారు. ఆహారం విషయంలో జాగ్రత్తలు, పదో తరగతి విద్యార్థులకు జరిగే ప్రత్యేక తరగతుల నిర్వాహనపై ప్రత్యేక నిఘా పెంచారు. ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ చేయడమే కాకుండా ప్రతి రోజు నివేదికను జిల్లా ఉన్నతాధికారికి అందించేలా ప్రణాళిక రూపొందించారు.

ఉపాధ్యాయులకు పరీక్ష

ఏప్రిల్ మూడో తేదీ నుంచి జరిగే పదో తరగతి పరీక్షలు విద్యార్థులకే కాదు. ఉపాధ్యాయులకు పరీక్ష అన్నతీరుగా మారింది. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం మీదనే ఉపాధ్యాయుల పనితీరు లెక్కిస్తామని అధికారులు చెబుతున్నారు. త్వరలో జరుగబోయే బదిలీల్లో పదో తరగతి ఉత్తీర్ణత శాతానికి కూడా మార్కులు ఉన్నాయి. అన్నింటికి తోడు ప్రతి పాఠశాల, ప్రతి ఉపాధ్యాయుడిపై రివ్యూ ఉంటుందని జిల్లా అధికారులు తేల్చి చెప్పారు. తాము బోధించే సబ్జెక్టులో ఫెయిల్ అయిన విద్యార్థుల గురించి ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయుడే అపాలజీ ఇవ్వాల్సి ఉంటుంది. అదేవిధంగా కేజీబీవీ, ఇతర కాంట్రాక్టు ఉపాధ్యాయులు, ప్రత్యేకాధికారుల రెన్యూవల్స్‌కు పదో తరగతి ఫలితాలకు లింకు పెట్టారు. మంచి ఫలితాలు సాధించిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు సన్మానాలు, అవార్డులు అందజేస్తామని చెప్పారు. ఉత్తీర్ణతలో వెనకబడిన వారిపై కొరడా ఝులిపిస్తామని రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా అధికారుల వరకు తేల్చి చెప్పారు. దీంతో తాము బోధించే సబ్జెక్టులో అందరు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రణాళిక వేసుకుంటున్నారు. పోటీ పడి మరి ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నారు. ఇప్పటికే ప్రీ ఫైనల్ పరీక్షలు పెట్టి విద్యార్థుల ప్రగతిని అంచనా వేస్తున్నారు. వెనకబడిన చోట ప్రత్యేక దృష్టి పెట్టి చదివిస్తున్నారు. ఇలా ఉపాధ్యాయులు కూడా కష్టపడాల్సి వస్తుంది.

పదో తరగతి విద్యార్థుల వివరాలు

బాలురు	: 4,249
బాలికలు	: 4,210
మొత్తం	: 8,459

క్రీడాకారులకు బహుమతి అందజేస్తున్న ఎస్పీ శరత్ చంద్రపవార్



క్రీడలతో మానసికోల్లాసం

- ఎస్పీ శరత్ చంద్ర పవార్

మహబూబాబాద్ అర్బన్: క్రీడలతో మానసికోల్లాసం, ప్రశాంతత లభిస్తుందని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో శనివారం మహబూబాబాద్, తొర్రూరు సబ్ డివిజన్ మహిళా సిబ్బందికి ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించగా ఎస్పీ హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసులు శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవడానికి, మానసి కోల్లాసానికి క్రీడలు దోహదపడతాయన్నారు. కబడ్డీలో మహబూబాబాద్ జట్టు, తొర్రూరు జట్టు తలపడగా మహబూబాబాద్ జట్టు విజయం సాధించింది. ఖోఖో లో తొర్రూరు, మహబూబాబాద్ జట్టు తలపడగా తొర్రూరు జట్టు విజయం సాధించింది. ఇరుజట్లకు ప్రథమ, ద్వితీయ బహుమతులను ఎస్పీ అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, మహబూబాబాద్ ఇన్‌చార్జ్ డీఎస్పీ రమణ బాబు, క్రీడల ఆర్గనైజర్ ఆర్.ఐ సురేష్, టౌన్ సీఐ సతీష్, రూరల్ సీఐ రమేష్, ఆర్‌ఐలు నరసయ్య, లాల్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ



రిజిస్టర్లను పరిశీలిస్తున్న డీఈఓ రామారావు

కేసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి గ్రామ జెడ్పీఎస్ఎస్‌ను డీఈఓ పి.రామారావు శనివారం ఆకస్మికంగా సందర్శించాడు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను, పాఠశాల అకాడమిక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం ఏవిధంగా అందిస్తున్నారని హెచ్‌ఎం విజయసుశీలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో తెలంగాణ ఆదర్శం

- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు



నాయకులతో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ దేశానికే రోల్ మోడల్‌గా మారిందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం వరంగల్ జిల్లా పర్వతగిరిలోని మంత్రి నివాసంలో పాలకుర్తి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులతో మంత్రి సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో అసంపూర్తిగా మిగిలిన పనులు, కొత్తగా చేపట్టాల్సిన పనులపై చర్చించారు. అభివృద్ధి పనుల వేగవంతానికి కృషి చేయాలని సూచించారు.

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఒక్కో మండలంలో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. తొర్రూరు మున్సిపాలిటీలో రూ.150 కోట్లతో వివిధ మౌలిక సౌకర్యాలు కల్పించామన్నారు. రూ.5 కోట్లతో 3 వేల మందికి కుట్టు శిక్షణ అందించి మిషన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీలు తూర్పాటి చిన్న అంజయ్య, నల్లా నాగిరెడ్డి, జినుగు అనిమిరెడ్డి, ధరావత్ జ్యోతి, బీఆర్‌ఎస్ అధ్యక్షులు పసుమర్తి సీతారాములు, నర్సింహనాయక్, వెంకటేశ్వర్‌రెడ్డి, నవీన్‌కుమార్, జెడ్పీటీసీలు మంగళపల్లి శ్రీనివాస్, పుస్కూరి శ్రీనివాసరావు, కుమార్, కేలోతు సత్తెమ్మ, పాలకుర్తి దేవస్థాన చైర్మన్ రామచంద్రయ్యశర్మ, మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, నాయకులు గాంధీనాయక్, లింగాల వెంకటనారాయణగౌడ్, జాటోతు నెహ్రూ, సోమనర్సింహరెడ్డి, దేవేందర్‌రెడ్డి, రాంబాబు, మదార్, బిల్లా సుధీర్‌రెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

దొరవారితిమ్మాపురం తరలింపునకు సహకరించాలి



గిరిజన సంఘాల నాయకులతో మాట్లాడుతున్న అధికారులు

గూడూరు: దట్టమైన అడవిలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న మట్టెవాడ శివారు దొరవారితిమ్మాపురం గ్రామం తరలింపునకు ఆదివాసీ, తుడుందెబ్బ సంఘాలు గ్రామస్తులతో కలిసి సహకరించాలని డీఎఫ్‌ఓ రవికిరణ్ కోరారు. మండల కేంద్రంలోని ఫారెస్టు రేంజ్ కార్యాలయంలో శనివారం ఫారెస్టు అధికారులు దొరవారితిమ్మాపురం గ్రామ తరలింపు విషయమై ఆదివాసీ, తుడుందెబ్బ సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఎఫ్‌ఓ వారితో మాట్లాడుతూ వైల్డ్ లైఫ్ ఏర్పాటుకు దట్టమైన అడవిలో ఆ గ్రామం అడ్డుగా ఉందని, పైగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు ఇబ్బందికరంగా ఉందన్నారు. మారుతున్న నాగరికతకు ఆదర్శంగా ఆ గ్రామాన్ని మైదాన ప్రాంతంలోకి తరలించి, వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామనే భరోసా ఇచ్చారు. ఈ విషయమై గ్రామస్తులను ఒప్పించి సహకరించాలన్నారు. అనంతరం సంఘాల నాయకులు విలేకరులతో మాట్లాడుతూ అధికారుల సూచన మేరకు గ్రామస్తులతో మాట్లాడుతామని, వారి అంగీకారం మేరకు ప్రయత్నిస్తామని, కానీ అటవీశాఖ అధికారులను, ప్రభుత్వాన్ని నమ్మబోమన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీఓ చంద్రశేఖర్, ఎఫ్‌ఆర్వో సురేష్, ఎస్సై సతీష్‌గౌడ్, ఆదివాసీ, తుడుందెబ్బ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన రైల్వేస్టేషన్

దోర్నకల్: వలస కూలీలతో డోర్నకల్ రైల్వే స్టేషన్ కిక్కిరిసింది. శనివారం వలస కూలీలు స్థానిక రైల్వే స్టేషన్ నుంచి సింగరేణి రైలు ద్వారా పెద్ద సంఖ్యలో మహారాష్ట్రలోని తమ గమ్యస్థానాలకు తరలివెళ్లారు. టికెట్ బుకింగ్ కార్యాలయంలో కూలీలు క్యూ కట్టడంతో అదనపు సిబ్బంది టికెట్లు జారీ చేశారు. టికెట్లు తీసుకుని ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ద్వారా నాలుగో నంబర్ ప్లాట్‌ఫారంపైకి చేరుకున్నారు. రైలు కొద్దిసేపట్లో స్టేషన్‌కు చేరుకునే సమయంలో రెండో నంబర్ ప్లాట్‌ఫారంకు వస్తుందని ఎనౌన్స్ చేశారు. దీంతో కూలీలు, ప్రయాణికులు నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం నుంచి ఫుట్ ఓవర్ బ్రిడ్జి మీదుగా రెండో నంబర్ ప్లాట్‌ఫారంపైకి చేరుకునేందుకు తీవ్రఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైలు స్టేషన్‌కు చేరుకున్న తర్వాత బోగీలోకి చేరేందుకు తోపులాట జరిగింది. కూలీలందరూ రైలు ఎక్కిన తర్వాత రైలు కదిలింది.



ప్లాట్‌ఫామ్‌పై బారులు తీరిన కూలీలు, ప్రయాణికులు


ఉపాధ్యాయులే వంట వర్కర్లు!



వంట గిన్నెలు శుభ్రం చేస్తున్న ఉపాధ్యాయురాలు

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా కేంద్రంలోని కస్తూరిబా విద్యాలయంలో ఉపాధ్యాయురాలు వంట మనుషులుగా అవతారం ఎత్తారు. వివరాలిలా ఉన్నాయి.. ఈనెల 9న మానుకోట కస్తూరిబా విద్యాలయంలో కలుషితఆహారం, నీళ్లు తాగి సుమారు 70 మంది విద్యార్థులు అస్వస్థత గురైన విషయం విధితమే. దీంతో కలెక్టర్ కె. శశాంక ఈనెల 10న వంట మనుషులకు మెమోలను జారీ చేశారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వంట వర్కర్లను ఇతర ప్రాంతాలకు, ఇతర ప్రాంతంలో వారిని ఇక్కడికి బదిలీ చేశారు. ఈ క్రమంలో ఇతర ప్రాంతంలోని కస్తూరిబా విద్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వంట వర్కర్లు మానుకోట కస్తూరిబా విద్యాలయానికి రాకపోవడంతో ఉపాధ్యాయులే ఈనెల 10వ తేదీ నుంచి పంటలు వండి వడ్డిస్తున్నారు. కూరగాయలు తరగడం నుంచి వంట సామాన్లు, డైనింగ్ హాల్, గదులు శుభ్రం చేసే వరకు వారే చేస్తున్నారు. ఈ ప్రభావం విద్యార్థుల ఫలితాలపై చూపనుంది. ఈ ఘటనపై పూర్తి విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు



సాగు చేసిన పసుపును పరిశీలిస్తున్న డీఏఓ

కేసముద్రం: ప్రకృతి వ్యవసాయంతో నేలసారవంతంతోపాటు, అధిక లాభాలను పొందవచ్చని డీఏఓ ఛత్రునాయక్ అన్నారు. శనివారం మండలంలోని కల్వల గ్రామంలో గంట దామోదర్‌రెడ్డి అనే రైతు ప్రకృతి వ్యవసాయం కింద సాగు చేస్తున్న పసుపు, పెసర, వరి, మినుము పంటలను డీఏఓ సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంలో పెట్టుబడి తక్కువగా ఉంటుందని, దిగుబడి వచ్చిన పంటకు మార్కెట్‌లో అధిక ధర లభిస్తుందన్నారు. ప్రకృతి సాగు చేస్తున్న గంట దామోదర్‌రెడ్డిని రైతులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. 21 రకాల పసుపు ఉత్పత్తులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ లక్ష్మీనారాయణ, ఏఈఓ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

వడగళ్ల వాన బీభత్సం

తొర్రూరు/పెద్దవంగర/దంతాలపల్లి: జిల్లాలోని పలు మండలాల్లో శనివారం రాత్రి కురిసిన వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. జిల్లాలో దంతాలపల్లి, తొర్రూరు, పెద్దవంగర మండలాలతో పాటు పలు గ్రామాల్లో అకాల వర్షానికి పలుచోట్ల ఆస్తినష్టం జరిగింది. చెర్లపాలెం, హరిపిరాల, చీకటాయపాలెంలోని మామిడితోటలకు స్వల్ప నష్టం వాటిల్లింది. పండ్ల తోటలతోపాటు వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం ప్రజలను భయాందోళనలకు గురిచేసింది. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడగా ఆయా గ్రామాల్లో వృక్షాలు నేలకూలాయి. పెద్దవంగర మండలం పోచారం గ్రామంలో చెట్టు కూలి పాడిగేదె మృతి చెందింది.





తొర్రూరులో కురిసిన వడగళ్ల వాన



పోచారంలో మృతి చెందిన పాడిగేదె



రెడ్డికుంటతండాలో నేలవాలిన మొక్కజొన్న



వడ్డెకొత్తపల్లిలో నేలకూలిన విద్యుత్ స్తంభం

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



మైనార్టీ కళాశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాస్

మహబూబాబాద్ అర్బన్: మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనం అందించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస రావు అన్నారు. జిల్లా కేంద్రంలో మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాల హాజరు, హాస్టల్ రిజిస్టర్లు సక్రమంగా ఉండాలని, స్టోర్ రూంలో బియ్యం నిల్వలో జాగ్రత్తలు పాటించాలన్నారు. వంటలో వినియోగించే వివిధ వస్తువులు, కూరగాయలు తాజాగా ఉండాలన్నారు. ఎండాకాలం తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు వడదెబ్బ తగలకుండా తగిన చర్యలు తీసుకోవాలని, స్టాఫ్ నర్స్ నిరంతరం అందుబాటులో ఉండాలని, విద్యార్థులు ఇంటర్లో వంద శాతం ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ ఇమాముద్దీన్, మైనార్టీ సంక్షేమ శాఖ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జిచే విచారణ చేపట్టాలి



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

మహబూబాబాద్ అర్బన్: ఎస్‌పీఎస్‌సీ చైర్మన్ జనార్దన్ రెడ్డి, కార్యదర్శి అనితా రామచంద్రన్ పేపర్ లీకేజీ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. శనివారం బీజేపీ ఆధ్వర్యంలో మానుకోట కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్‌సీ ఇప్పటివరకు జరిగిన పరీక్ష అన్నింటి పైన సమగ్రమైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీపై సిట్టింగ్ హైకోర్టు జడ్జిచే విచారణ జరిపించి దోషులను శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో మానుకోట పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ సింగార సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్, జిల్లా ఉపాధ్యక్షురాలు ఒర్సు పద్మావతి, జిల్లా కార్యదర్శి రేష్మ, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రాంబాబు, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షుడు ఇందూభారతి, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు సిరికొండ సంపత్, మండల అధ్యక్షుడు మోతీలాల్, నాయకులు పల్లె సందీప్, యశ్వంత్, నాగరాజు, శ్రీనివాస్, పెంటయ్య, ప్రేమ్, సందీప్, శ్రీకాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై టోల్ ప్లాజా సిబ్బంది దాడి

- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు.. ఇరువురిపై కేసు నమోదు
- అరగంట పాటు వీక్షించినా పని చేయని ఫాస్టాగ్
- ఇదేంటని అడిగినందుకు దాడి

రఘునాథపల్లి: మండలంలోని కోమల్ల టోల్‌ప్లాజా సిబ్బంది ఆగడాలు రోజురోజుకు మితిమీరుతున్నాయి. సాంకేతిక కారణాలతో ఫాస్టాగ్ పని చేయని సమయంలో వాహనదారులకు సర్ది చెప్పాల్సిన సిబ్బంది, వారిపై దాడులకు దిగుతున్నారు. గతంలోనూ అనేక గొడవలు జరిగాయి. తాజాగా శుక్రవారం రాత్రి ఏకంగా సర్పంచ్, ఆయన బంధువులపై అక్కడి సిబ్బంది దాడికి దిగారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్ వీరేందర్ తెలిపారు. మండలంలోని ఖిలాషాపూర్ సర్పంచ్ ముప్పిడి శ్రీధర్ శుక్రవారం మధ్యాహ్నం తన టీఎస్ 03 ఈపీ1500 నంబర్ కారులో వివాహానికి హాజరయ్యేందుకు బంధువులతో కలిసి హనుమకొండకు వెళ్లారు. నిత్యం ఆ మార్గంలో రాకపోకలు సాగించే అతను రూ.315తో నెల పాస్ తీసుకున్నాడు. అక్కడ ఆర్‌ఎఫ్‌ఐడీ రీడ్ చేయకపోవడంతో ఫాస్టాగ్‌లో రూ.200 రీచార్జ్ చేసుకొని వెళ్లాడు. రాత్రి తిరిగి వస్తుండగా టోల్ ప్లాజా వద్ద మళ్లీ పాస్ పని చేయకపోవడంతో మరో రూ.200 ఫాస్టాగ్ రీచార్జ్ చేశాడు. 15 నిముషాల సమయం పడుతుందని సిబ్బంది చెప్పడంతో వెనక్కి వెళ్లిన ఆయన 20 నిముషాల పాటు వేచి చూశాడు. తిరిగి వెళ్లగా అప్పుడూ ఫాస్టాగ్ పని చేయలేదు. దీంతో నెల పాస్ పనిచేయదు. ఫాస్టాగ్ పని చేయదు ఇక్కడ ఎంత సమయం వేచి చూడాలని సర్పంచ్ ప్రశ్నించారు. ఈ క్రమంలో టోల్‌ప్లాజా సిబ్బంది సర్పంచ్‌తో పాటు ఆయన బంధువులపై దాడికి దిగారు. దీంతో సర్పంచ్ రఘునాథపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దాడికి పాల్పడిన టోల్ సిబ్బంది రాజనీష్, శ్రవణ్‌లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా టోల్‌ప్లాజా సిబ్బంది తీరుపై వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అనాథలను కదిలిస్తే కన్నీళ్లే..!



- ఆదరణలేని వృద్ధులకు ఆశ్రయం
- అనాథ ఆశ్రమం ఓ దేవాలయం
- మేమున్నామంటూ అమ్మలా ఆదరిస్తున్న 'ఎలగందుల' వృద్ధాశ్రమం



మాట్లాడుతున్న నిర్వాహకుడు ఎలగందుల లక్ష్మీనారాయణ



ఆశ్రమంలో సేద తీరుతున్న వృద్ధులు..

ఖిలావరంగల్: నా అనే వాళ్లు లేక కొందరు.. ఉన్నా పట్టించుకోని వారు మరికొందరు.. కారణమేదైనా జీవితం చివరి దశలో పండుటాకులు ఆదరణ కోల్పోయి ఆశ్రమంలో కాలం వెళ్లదీస్తున్నారు. మానవసేవే మాధవ సేవగా భావిస్తూ అనాథలను అమ్మలా ఆదరిస్తూ సమాజ నిరాధరణ, కుటుంబ సభ్యుల నిర్లక్ష్యానికిలోనై నిస్సహాయ స్థితిలో ఉన్న వారిని అక్కున చేర్చుకుని ఆశ్రయం కల్పిస్తోంది. చివరికి చనిపోయాక కూడా దహన సంస్కారాలు నిర్వహిస్తుంది ఖిలావరంగల్ మండలంలోని రాంగోపాలపురంలోని ఎలగందుల అమృత స్మారక వృద్ధాశ్రమం. జిల్లాలోని సరస్వతీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఎలగందుల లక్ష్మీనారాయణ ఎవరూలేని అనాథలతో పాటు కొడుకులు, కూతుర్లు చీదరించుకున్న తల్లిదండ్రులను ఆదరిస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు. తల్లిలా లాలిస్తూ.. తండ్రిలా ఆదరిస్తూ.. కుటుంబ సభ్యుల్లా పలకరిస్తూ అనాథల కన్నీళ్లను తుడుస్తూ ముందుకు సాగుతున్నాడు.

ఆలోచన ఎలా వచ్చింది..

ఉపాధ్యాయ వృత్తిలో రిటైరయ్యాను.. సేవ చేయాలనే ఆలోచనతో 1999లో ఎలగందుల అమృత స్మారకార్థం ఆశ్రమం స్థాపించానంటున్నారు ఆశ్రమ వ్యవస్థాపక నిర్వాహకులు ఎలగందుల లక్ష్మీనారాయణ. హెడ్ మాస్టర్‌గా రిటైర్డు అయిన తర్వాత సుమారు 1000 గజాల స్థలంలో రాంగోపాల్‌పురం గ్రామ సమీపంలో ఆశ్రమం నిర్మాణానికి నడుంబిగించాను. నిధుల లేమితో కొన్ని ఇబ్బందులు పడ్డాను. దాతల సహకారంతో అనుకున్న పనిని విజయవంతంగా కొనసాగిస్తున్నాను.

చనిపోయిన వారికి దహన సంస్కారాలు సైతం..

ఆశ్రమంలో చేరినప్పటి నుంచి చివరి వరకు ఉండి ఆ తర్వాత చనిపోయిన వృద్ధులకు దహన సంస్కారాలు ఆశ్రమ నిర్వాహకులే నిర్వహించడం విశేషం. ఒకసారి ఆశ్రమంలో చేరాక మా కుటుంబ సభ్యుల లాగే మేం భావిస్తామని, ఎవరైనా వృద్ధులు చనిపోతే మా ఇంట్లో సభ్యుడు చనిపోయిన విధంగా భావిస్తామని చెబుతున్నారు ఆశ్రమ నిర్వాహకులు.

ప్రభుత్వం సహకరిస్తే సేవలు విస్తరిస్తా..



నేను 70 ఏళ్ల వృద్ధుడిని..నాతోటి వృద్ధులకు చేరదీసి ఆకలి తీర్చాలన్నదే నాకోరిక. నాకు చిన్నప్పటి నుంచి సేవ చేయాలనే భావన ఉండేది. వృద్ధులు అంటే చీదరించుకునే వారు చాలామంది ఉన్నారు. నాకు చేతనైనంత సహాయం చేయడమే నాకు సంతృప్తి. ప్రభుత్వం సహకరిస్తే ఆదరణ కోల్పోయిన వారికి మరింత మందికి ఆశ్రయం కల్పిస్తాం.

\- లక్ష్మీనారాయణ ఆశ్రమ చైర్మన్

నాకు ఎవరూ లేరనే బాధ లేదు



ఈ ఆశ్రమంలో చేరినప్పటి నుంచి నాకు ఎవరూ లేరనే బాధ లేదు.నాకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు బిడ్డలు ఉన్నారు. ఒక కొడుకు లోకానికి దూరమయ్యాడు. బిడ్డలు పట్టించుకోరూ. మనవళ్ల ప్రేమకు దూరం చేశారు. నన్ను మా మనవడు ఆశ్రమంలో ఉంచాడు. ఇక్కడివాళ్లు కుటుంబ సభ్యుల్లా చూసుకుంటున్నారు. నాకు ఏ లోటు లేదు.

\- జ్యోతి యాకమ్మ, వృద్ధురాలు

ఆరేళ్ల నుంచి ఇక్కడే ఉంటున్నా..



బస్సు ప్రమాదంలో రెండు కాళ్లు పోయాయి. నా భార్య అనారోగ్యంతో మృతి చెందింది. నాకు ఏకైక కుమార్తె ఉన్నా.. నా కాళ్లు పోగానే నన్ను చీదిరించుకుని నేరుగా నన్ను ఆశ్రమంలో వదిలేసి వెళ్లింది. నా అత్త దేవత నాకు ఆర్థికసాయం చేస్తోంది. ఇక్కడి వారే నా బిడ్డలు తల్లిదండ్రులుగా భావిస్తున్నా.

\- తాదూరి వేణుగోపాల్

పీఏసీఎస్ చైర్మన్‌పై దాడి

హసన్‌పర్తి: మండలంలోని వంగపహాడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మేర్గు రాజేష్‌పై దాడి జరిగిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వ్యక్తిగత పనులు ముగించుకుని బైక్‌పై రాజేష్ ఇంటికి బయల్దేరగా మార్గమధ్యలో ముగ్గురు వ్యక్తులు అడ్డంగా వచ్చి బైక్‌ను కాళ్లతో బలంగా కొట్టారు. ఈ సంఘటనలో రాజేష్ కిందపడడంతో బలమైన గాయాలయ్యాయి. మారణాయుధాలు ఉన్నట్లు గమనించిన రాజేష్ వారి నుంచి తప్పించుకున్నాడు. గమనించిన ఇద్దరు యువకులు కేకలు వేయడంతో వారు పరారయ్యారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు...

హసన్‌పర్తికి చెందిన రాకేష్, నితిన్, కన్నయ్య దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈఘటనలపై దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాలుగు నెలలుగానే...

ఇదిలా ఉండగా నాలుగు నెలలుగా రాజేష్‌పై దాడికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిసింది. రెండు నెలల క్రితం దామెర సమీపంలో రాజేష్‌పై దాడి చేయడానికి యత్నించారని స్థానికంగా చర్చ జరుగుతోంది.

డిటోనేటర్ల కలకలం

- మేకల కాపరి ఇచ్చిన సమాచారంతో పోలీసుల అప్రమత్తం
- బాంబుస్క్వాడ్ తనిఖీల్లో బయటపడ్డ 500 డిటోనేటర్లు

బయ్యారం: మండలకేంద్రంలో శనివారం రాత్రి పోలీసులకు పట్టుబడ్డ ఎలక్ట్రిక్ డిటోనేటర్లు స్థానికంగా కలకలం రేపాయి. వివరాలు ఇలా ఉన్నాయి. బయ్యారంలోని వ్యవసాయశాఖ కార్యాలయం వెనుకభాగంలో ఉన్న ఖాళీ స్థలంలో ఒక గోనె సంచిలో ఎలక్ట్రిక్ డిటోనేటర్లు (మందుగుండు సామాగ్రి) ను మేకలకాపరి గుర్తించాడు. ఈ విషయాన్ని పోలీసులకు తెలిపాడు. వెంటనే ప్రాంతానికి చేరుకున్న గార్ల-బయ్యారం సీఐ బాలాజీ, ఎస్సై రమాదేవి సోదాలు నిర్వహించి బాంబుస్క్వాడ్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఆ బృందం ఆ ప్రాంతానికి చేరుకొని పాత గోనెసంచిలో ఉన్న డిటోనేటర్లను స్వాధీనపర్చుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

జనావాసాల మధ్యకు ఎలా వచ్చాయి...?

పోలీస్‌స్టేషన్‌కు అరకిలోమీటర్ దూరంలో జనావాసాలు ఉండే ప్రాంతంలోకి పేలుడుకు ఉపయోగించే డిటోనేటర్లు ఎలా వచ్చాయి అనే ప్రశ్నలు పలువురిలో వ్యక్తమవుతున్నాయి. డిటోనేటర్లు లభ్యమైన బస్తాను బట్టి చూస్తే చాలా ఏళ్ల క్రితం వీటిని అక్కడ వదిలివెళ్లినట్టు ప్రాథమికంగా తెలుస్తోంది. డిటోనేటర్లను కంప్రెషర్‌బండ్ల నిర్వాహకులు పెట్టారా లేక గతంలో మండలంలో ప్రాబల్యం ఉన్న నక్సల్స్ గ్రూపులు పెట్టారా అనే విషయం విచారణలో తేలాల్సి ఉంది. ఈ విషయంపై సీఐ బాలజీని వివరణ కోరగా డిటోనేటర్లు లభ్యమైన విషయం వాస్తవమేనని ఈ డిటోనేటర్లను ఎవరు పెట్టారు అనే విషయంపై విచారణ నిర్వహిస్తామన్నారు.

నెక్కొండలో మద్యం పట్టివేత

నెక్కొంద: అక్రమ మద్యంను స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టు చేసిన సంఘటన స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ హథీరాం నాయక్ తెలిపిన వివరాలు... రైలు ద్వారా అక్రమ మద్యం దందాకు పాల్పడుతుండగా పక్కా సమాచారం మేరకు స్థానిక రైల్వే స్టేషన్‌లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. తనిఖీలో భాగంగా అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తిని అతని వద్ద ఉన్న బ్యాగులను పోలీసులు సోదా చేశారు. భూపాలపల్లి జిల్లా మహాముత్తారం గ్రామానికి చెందిన మహ్మద్ మెహబూబ్‌పాష, అతని కుమారుడు మహ్మద్ రఫీ మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యంను రైళ్ల ద్వారా తెలంగాణ రాష్ట్రానికి తీసుకొచ్చి విక్రయానికి పాల్పడుతునట్లు తేలిందని సీఐ పేర్కొన్నారు. మెహబూబ్‌పాషను అరెస్టు చేశామని, రఫీ పరారీలో ఉన్నట్లు చెప్పారు. వీరి నుంచి సిగ్నేచర్ ఫుల్ బాటిళ్లు 47, ఆర్‌సీ ఫుల్ బాటిళ్లు 12, వీటి విలువ సుమారు రూ. 73,305 ఉంటుందన్నారు. కార్యక్రమంలో నర్సంపేట ఎక్సైజ్ ఎస్సై రాజేశ్వరీ, పోలీసులు, పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసం

- గర్భవతిని చేసి మరో యువతితో వివాహం
- యువకుడి మోసంపై పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు



పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు రీణా

పాలకుర్తి టౌన్: ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని యువతిని లొంగదీసుకున్నాడు. గర్భవతిని చేసి అందరికి తెలిస్తే అసలుకే మోసం వస్తుందని గ్రహించి బలవంతగా అబార్షన్ చేయించాడు. అవసరం తీరాక మరో యువతిని వివాహం ఆడడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించిది. ఈ ఘటనపై స్థానిక పోలీసు సేష్టన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. పాలకుర్తి మండలం శాతాపురం గ్రామానికి చెందిన లకావత్ వినోద్ జనగామ డిగ్రీ చదువుతున్న సమయంలో లింగాలఘణపురం మండలంలోని చీటూరు గ్రామానికి చెందిన రీణాతో పరిచయమైంది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని వినోద్ నమ్మబలికి ఇద్దరు శారీరక బంధానికి కారణమైంది. దీంతో ఆ యువతి గర్భం దాల్చింది. ఎన్నిసార్లు పెళ్లి విషయం అడిగినా సదరు యువకుడు మొహం చాటేశాడు. ఇటీవల గుట్టుచప్పుడు కాకుండా మరో యువతిని వివాహం చేసుకున్నాడు. పెళ్లి విషయం ప్రేమికురాలికి తెలియగా అడుగుదామని ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. చివరికి యువకుడు పారిపోయాడు. శనివారం శాతాపురం గ్రామానికి వచ్చిన యువతి ప్రేమించి మోసం చేసిన యువకుడి ఇంటికి వెళ్లగా ఆ యువకుడి అక్క, బావ ఇద్దరు ఆ యువతిపై దాడికి పాల్పడ్డారు. స్థానికుల సహాయంతో పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో యువతికి చికిత్స అందించారు. ప్రేమంచి పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వినోద్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసింది. రీణా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తాళ్ల శ్రీకాంత్ తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది యువకుడి ఆత్మహత్య



జనార్ధన్ మృతదేహం

సంగెం : మద్యానికి బానిసైన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని తిమ్మాపూర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా కటంగూర్ మండలం చెరువు అన్నారం గ్రామానికి చెందిన వరికుప్పల ఇస్తారి భార్య పిల్లలతో కలిసి వచ్చి ఏడేళ్లుగా తిమ్మాపూర్‌లో ఉంటూ బావులు పూడికతీస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇస్తారి కుమారుడు జనార్ధన్ (22) నాలుగేళ్ల క్రితం ఎల్గూర్‌రంగంపేటకు చెందిన అనూషను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం. ఇటీవల జనార్ధన్ తాగుడుకు బానిసయ్యాడు. శనివారం బాలునాయక్ తండాలో బావిపూడికకు తల్లిదండ్రులతో కలిసి వెళ్లిన అతను పనిచేయకుండా ఇంటికి తిరిగివచ్చాడు. భార్య అనూష బట్టలు ఉతికి సాయంత్రం వెళ్లి చూడగా లోపల గొళ్లెం పెట్టి ఉంది. అనుమానం వచ్చి చుట్టుపక్కల వారు నరేష్, రాజులను పిలువగా తలుపులు తెరిచేసరికి ఉరేసుకొని మృతి చెంది ఉన్నాడు. మద్యానికి బానిసైన జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడినట్లు తండ్రి ఇస్తారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భరత్ తెలిపారు.

పెళ్లి ఇంట విషాదం

- గుండెపోటుతో వధువు తల్లి మృతి
- శోక సంద్రంలో ఇరు కుటుంబాలు



స్వరూప (ఫైల్)



పెళ్లిలో అల్లుడు, కుమార్తెతో స్వరూప (కుడి వైపు నుంచి రెండో వ్యక్తి)

బచ్చన్నపేట : అమ్మాయి, అబ్బాయి తరుపున వారం దరూ కలిసి శుక్రవారం మండలంలోని శ్రీనిధి గార్డెన్‌లో వైభవంగా వివాహాన్ని జరిపించారు. రాత్రివేళ బరాత్ తీసి అమ్మాయి, అబ్బాయిని ఇంటిలోకి సాగనంపిన అనంతరం అమ్మాయి తల్లి శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందింది. దీంతో ఇరు కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. మండలంలోని కేసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జక్కుల కనుకమ్మ, అయ్యాల్లం దంపతుల కుమారుడికి సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం మర్మాముల శివారు బంజేరుకు చెందిన జంగిలి స్వరూప (35), మల్లేశం దంపతుల కూతురు మౌనికను ఇచ్చి పెళ్లి జరిపించారు. శనివారం పదహారు పండుగ జరుపుకునే క్రమంలో అందరూ బీజీగా ఉండగా పెళ్లి కూతురు తల్లి స్వరూప ఉదయం మోహం కడుక్కుంటూ కుప్పకూలింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పెళ్లి ఇంట్లో అశుభం జరుగడంతో వచ్చిన బంధువులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతురాలికి పెళ్లి కావల్సిన మరో ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి



చందు(ఫైల్)

వర్ధన్నపేట : బైక్‌పై వెళ్తున్న యువకుడికి రోడ్డుపై పంది అడ్డురావడంతో దానిని తప్పించబోయి కిందపడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై రామారావు కథనం ప్రకారం.. వరంగల్ పోచమ్మమైదాన్‌కు చెందిన తాళ్లపెల్లి చందు(21) హన్మకొండలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో డిగ్రీ సెకండియర్ చదువుతున్నాడు. శుక్రవారం కళాశాలలో సిల్వర్ జూబ్లీ వేడుకలను పురస్కరించుకుని తన బైక్‌పై ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకుని తన స్నేహితుడైన సత్తు దిలీప్‌తో కలిసి వెళ్లాడు. అక్కడి నుంచి తన అమ్మమ్మ గ్రామమైన జనగాం జిల్లా జఫర్‌ఘడ్ మండలం తమ్మడపెల్లి(జి) గ్రామానికి రాత్రి చేరుకుని తిరిగి అదే రాత్రి తన స్నేహితుడు దిలీప్‌తో కలిసి బైక్‌పై వస్తుండగా వర్ధన్నపేట పిరంగిగడ్డ ప్రాంతంలో రోడ్డుపై పంది వచ్చింది. దానిని తప్పించబోయి కిందపడడంతో చందు తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్నేహితుడు దిలీప్‌కు గాయాలు కాగా అతడిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మృతుడు తండ్రి పూర్ణచందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి..



సిద్దార్థ మృతదేహం

వరంగల్ (పర్వతగిరి): వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చింతనెక్కొండ గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. జనగామ జిల్లా జఫర్‌ఘడ్ మండలం తమ్మడపల్లి(ఐ) గ్రామానికి చెందిన మాచర్ల సిద్దార్థ(22) నెక్కొండ మండలం రెడ్లవాడలోని ఓ శుభకార్యానికి వెళ్లాడు. శుభకార్యం పూర్తయిన తర్వాత తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సిద్దార్థ తల్లి మాచర్ల అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై యాదగిరి తెలిపారు.

దీనగాథ

సిద్దార్థ కుటుంబంలో తల్లి,తండ్రి వేరుగా ఉంటున్నారు. సిద్దార్థ ఎంబీఏ మొదటి సంవత్సరం మల్కాజిగిరిలో చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో మొదటి సెమిస్టర్ పరీక్షలు రాయడానికి వరంగల్‌లోని తన సోదరి ఇంటికి వచ్చి పరీక్షలు రాసి శుక్రవారం సాయంత్రం రెడ్లవాడలోని తన స్నేహితుడి శుభకార్యానికి హాజరై శనివారం తెలవారుజామున ఎవరికి తెలియకుండా ద్విచక్ర వాహనం వెళ్లాడు. చింతనెక్కొండ వద్ద బైక్ అదుపు తప్పి అక్కడికక్కడే మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్..



మృతుడు ఎండీ.గౌస్ (ఫైల్)

కాజీపేట: గ్రేటర్ పరిధిలోని 62వ డివిజన్ సోమిడి శివారులో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బస్సు డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ధర్మసాగర్‌కు చెందిన ఎండీ.గౌస్ (45) మడికొండ రామన్ స్కూల్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పిల్లలను తీసుకుని కాజీపేటకు వస్తుండగా బస్సులో సాంకేతికలోపం తలెత్తడంతో ఆగిపోయింది. డ్రైవర్ కిందకు దిగి బస్సును మరమ్మతు చేస్తుండగా బస్సు ఆకస్మాత్తుగా ముందుకు కదలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని చేసి విచారణ చేపడుతున్నట్లు కాజీపేట పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి..

డోర్నకల్ : స్థానిక రైల్వే స్టేషన్‌లో శనివారం రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్పీ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక రైల్వే స్టేషన్ 4వ నంబర్ ప్లాట్‌ఫారం చివరన ఆర్ఆర్ఐ క్యాబిన్ ఎదుట రైలుపట్టాల ప్రక్కన మృతదేహం ఉందన్న సమాచారం మేరకు తమ సిబ్బంది ఘటనాస్థలానికి వెళ్లి స్థానికుల సహకారంతో మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు. మృతుడిని స్థానిక మెయిన్‌రోడ్డుకు చెందిన కాలా వినోద్‌కుమార్‌జైన్(63)గా గుర్తించినట్లు తెలిపారు. మృతుడు రాత్రివేళ పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెంది ఉంటాడని తెలిపారు. ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్‌కు చెందిన అన్నం శ్రీనివాస్ ఘటనాస్థలానికి చేరుకుని తమ వాహనంలో మృతదేహాన్ని ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడు భార్యకు దూరంగా ఒంటరిగా ఉంటుండగా డోర్నకల్‌లో సమీప బంధువులు ఉన్నారు.